కథ

# సద్భావన

- కోరుకొండ సత్యానంద్

నేనీ ఉద్యోగంలో చేరి రెండో సంవత్సరం నడుస్తోంది. క్రొత్తలో చాలా కన్ఫ్యూజ్ అయ్యేవాడిని, ఇప్పుడిప్పుడే గాడిలో పడ్డానని సీనియర్లందరూ అంటూంటారు. గాడిలో పడ్డం అంటే కరకుదేరడం. కరెన్సీ కోసం కక్కుర్తి పడ్డం. ప్రతి పనినీ ఏదో వంక పెట్టి అంతులేని జాప్యం చేయడం. అవతలి వారి అవసరాన్ని అడ్వాంటేజీగా తీసుకోవడం. ఒక్క ముక్కలో చెప్పాలంటే పటిష్టంగా ఎప్పుడో ఏర్పాటు చేసుకున్న 'విధానాల'కు తలవంచడం!

క్రమక్రమంగా ఆశయాల స్థానంలో ఆశ 'ఇంజెక్ట్' చేయబడుతోంది. విషం కొద్ది కొద్దిగా తలకెక్కుతోంది. గుండె బండబారుతోంది. స్వంత ఆలోచనలు మరుగున పడుతున్నాయి. క్రొత్త ఆలోచనలను మొలకెత్తుతున్నాయి. అయితే ఇంకా ఏవో పాత ఆలోచనలను పట్టుకు వ్రేళ్ళాడుతూనే ఫైళ్ళు చూస్తున్నాను. అ కాస్త ఆలోచనలూ కూడా పుటుక్కుమని తెగిపోతాయి. నేను సీనియర్లలో సమ ఉజ్జీనై పోతాను.

సరిగ్గా అలాంటి సమయంలో అమూల్య అనుకోని విధంగా తారసపడింది! ఆ రోజు-

ఒకొక్క ఫైలుకూ 'కలెక్ట్' చేయాల్సిన కరెన్సీని లెక్కచూసుకుంటూ సీరియస్‌గా రాసుకుంటున్నాను. అంతలో ఎవరో కదిలినట్లై తలెత్తి చూసాను. వెంటనే ఫైల్లో తల దూర్చేసేను. అతను దీనంగా ఉన్నాడు. హీనమైన స్వరంతో మాట్లాడ్డానికి సిద్ధంగా ఉన్నాడు. నేనలా తల దించుకోకపోతే కరెన్సీ రాల్చడు. కన్నీళ్ళు కార్చేస్తాడు.

"....బాబూ...."

నాకా పిలుపూ వినబడింది. కానీ వినబడనట్లునటించాలి. నా ఉద్దేశం అతని పని చేయగూడదని కాదు. పనిని బట్టి గుంజుకోవాలి. అందుకు అతనిని సన్నద్ధుడిని చేయాలి. చేస్తానో చెయ్యనో అన్న అనుమానాన్ని కలిగించాలి. అఫ్ కోర్స్. మా ఆఫీసుకి వచ్చేవాళ్ళు చేతులు తడిపే తీర్థంతోనే వస్తారనుకోండి. కానీ కొంతమంది దీనులూ, హీనులూ కూడా ఉన్నారుగా దేశంలో. వాళ్ళతోనే వస్తుంది చిక్కంతా.

"ఇదిగో బాబూ"

తలెత్తి చూసేను, ముఖంలో చిరాకు పెట్టుకొని. ఏమిటీ అని అడిగేను. నోటితో కాదు. నొసటితో. అతను చెప్పేడు. మామూలు కథే. పాత చింతకాయ పచ్చడి.

అతనొక బ్రాంచిలో యూడీసీ. అమ్మాయి పెళ్ళట. పి.ఎఫ్. లోన్ పెట్టాడట. శాంక్షన్ చేయించాలట. అర్జెంటట. అందుకే నేరుగావచ్చేడట.

"అప్లికేషను క్రిందటి నెల తొమ్మిదో తేదీన బాబూ"

"ఎంతకి పెట్టేరు?"

"పాతిక వేలకి"

"కారణం ఏమని రాసేరు?"

"అమ్మాయి పెళ్ళే అని రాసేను బాబూ"

"మీ బ్రాంచి మేనేజరు సర్టిఫై చేసేరా?"

"చేసేరు బాబూ. పెళ్ళి కుదిరిందగ్గర్నుండీ విషయాలన్నీ ఆయనకు తెలుసు కార్డు అందులో వుంది."

"పెళ్ళెప్పుడు?"

"వచ్చే నెల పదో తేదీన"

"అంటే రెండు నెలల ముందే కార్డులు ప్రింటు చేయించేసారా?"

"అవును బాబూ...?

"అంతే లెండి. బోగస్ అప్లికేషన్ కదా?"

"కాదు బాబూ. మా అమ్మాయి పెళ్ళి నిజంగా వచ్చేనెల పదోతేదీనే."

పెళ్ళి వాళ్ళకి కట్నం ఇంకా పాతిక వేలివ్వాలి. అదివ్వాలంటే లోను పెట్టాలి. మరో దారి లేదు. లోనుకి దరఖాస్తు పెట్టాలంటే పెళ్ళి కార్డు జత చేయాలి. కార్డులు వేయించాలంటే ముహూర్తాలు పెట్టుకోవాలి. కాబోయే వియ్యంకుడికి ఇవన్నీ చెప్పి ఇంత ముందుగా ముహూర్తాలు పెట్టించుకోడానికి ఒప్పించేను బాబూ. నాది బోగస్ అప్లికేషను కాదు బాబూ..."

"ఏదైతే నాకెందుకు లెండి. ఎప్రూవ్ చేసేముందు బాస్ ఇవన్నీ నన్నడుగుతాడు. అన్నీ కన్ఫర్మ్ చేసుకొని నోట్ పుటప్ చేయాలి కదా నేను"

"కాస్త చేసి పెట్టు బాబూ. నీకు ఋణపడి ఉంటాను."

"అంత మాటెందుకు లెండి. వివరాలు చెప్పండి"

రిజిష్టర్లో అతని అప్లికేషన్ ఇన్‌వర్డ్ నంబరు చూపాను. "మీకంటే ముందు చాలా ఉన్నాయండి. ఇవన్నీ చేస్తే గానీ మీది ముట్టుకోడానికి అవదు"

"ఎన్నాళ్ళు పడుతుంది బాబూ?"

"సరిగ్గా చెప్పలేను గానీ లోన్ శాంక్షన్‌అవడం కంటే ముందే మీ అమ్మాయి పెళ్ళి అయిపోతుంది."

"లోన్ చేతికందకపోతే అమ్మాయి పెళ్ళి అవదు బాబూ. ఆగిపోతుంది. నా పరిస్థితిని అర్థం చేసుకోబాబూ. ఏం చేస్తావో, తొందర్లో శాంక్షన్ అయ్యేట్టు చూడు బాబూ."

"కష్టవండీ. ఎందుకంటే నేనుచూసేది అన్ని రకాల లోన్సూనూ. రోజూ అన్నీ చేయాలి. పైగా సీరియల్ తప్పించి చేస్తే చాలా గొడవలవుతాయి. మీలాగే మిగతా వాళ్ళకీ అవసరాలుంటాయి కదా?"

"నాది అత్యవసరం బాబూ. ఏదోలా సాయం చేసి పెట్టు బాబూ"

"నేను చేసేది నేను చేస్తాను. కానీ ముందుగా బాస్‌కి చెప్పి ఏం చేయమంటారో కనుక్కోవాలి"

"కాస్త కనుక్కో బాబూ. వేచి ఉంటాను"

నేను లేచాను. క్యాంటీన్‌కువెళ్ళాను. టీ త్రాగాను. సిగరెట్టుకాల్చేను. కాలుస్తూ అనుకున్నాను. అతనిపని చేయాలను కుంటే సీరియల్ తప్పించక్కర్లేదు. రోజుకి నాలుగు గంటలు పని చేస్తే చాలు, అతనికెప్పుడో లోన్ శాంక్షనైపోయి ఉండేది. సిగరెట్ కాల్చడం అయిపోయాక నా సీట్లోకి వచ్చేను. నా వైపుఅతను ఆశగా చూస్తున్నాడు.

'అడిగేనండీ... అతి కష్టం మీద ఒప్పించగలిగేను"

నా మాటలకు అతని ముఖం వెలిగిపోయింది. అలాంటప్పుడే నీళ్ళు జల్లాలి.

"... కానీ ... బాస్ మామూలు మనిషి కాడు. కాస్త ఆశగలవాడు" అన్నాను మెల్లిగా.

అతని ముఖంలో మార్పొచ్చింది. నేను చెప్పడం కంటిన్యూ చేసాను నెమ్మదిగా. ... కనీసం ఫైవ్ పర్సెంటైనా ఇవ్వాలన్నాడు. నేనంటే మీ ముఖం చూసి ఫ్రీగా కష్టపడి పుటప్ చేస్తాననుకోండి. కానీ ఏమీ లేకుండా బాస్ గ్రీన్ ఇంక్‌తో సంతకం పెట్టడు..." అతని ముఖం ఆముదం త్రాగిన వాడిలా ఉంది.

నేను టీ త్రాగి, సిగరెట్టు కాల్చి వచ్చి ఈ మాటలన్నాను కాబట్టి అవన్నీ అబద్ధాలని మీరనుకోవచ్చు. ప్రతీసారీ బాస్ దగ్గరకు వెళ్ళి అడగక్కరలేదు. దేనిమీదైనా ఒకే సంతకం పెట్టే బాస్ ఒకో కేసుకి ఒకో రేటు పెట్టేసేడు. నాది అందులో పాతిక శాతం. అయితే ప్రతీసారీ కేసుని బట్టి, వ్యక్తి అవసరాన్ని బట్టి అప్పటికప్పుడు ప్లాన్ చేసి చిన్న డ్రామా ఆడాలి. ఆ డ్రామాలో భాగమే ఇందాకా నేను

క్యాంటీన్‌కు వెళ్ళి టీ త్రాగి సిగరెట్టు కాల్చడం.

"... బాబూ. అన్నీ మీకు చెపుతున్నానని విసుక్కోకండి. కాబోయే అల్లుడు నా కూతురంతే చదువుకున్నా, చేసేది సాధారణమైన ఉద్యోగమే అయినా మగవాడైనందుకు ఏభై వేలు ఇవ్వాల్సొస్తోంది. ఆ కట్నానికి ఒప్పించడానికే కష్టమైపోయింది. తట్టుకోలేని కష్టమే అయినా చవగ్గానే దొరికాడని అన్నారందరూ. పాతికేళ్ళ ఉద్యోగంలో వెనకేయ గలిగింది పాతికవేలుమాత్రమే. అదీ ఆడపిల్లను దృష్టిలో ఉంచుకొని ఎన్నో ఆశల్నీ, కోరికల్నీ వదిలేసుకుంటే. అది కట్నానికి అడ్వాన్స్‌గా ఇచ్చేను. మిగతాది పెళ్ళిలోగా ఇవ్వాలి. ఇవ్వకపోతే పెళ్లి ఆగిపోతుంది. ఆ మాట కుర్రాడి తల్లిదండ్రులు అప్పుడే చెప్పేరు. ఇంకా పెళ్ళి ఖర్చులూ వాటికీ మా ఆవిడ మెడలో పసుపు కొమ్ము కట్టాలి. అందుచేత ఈ పాతిక వేల్లోంచీ ఒక్క వందకూడా తీసే వీలు లేదు బాబూ...."

కథ సాధారణంగానే ఉంది కదండీ. అల్లి చెప్పినట్లుగా అన్పించలేదు. అయితే చివరి మాట మాత్రం అదోలా అన్పించింది. అందుకే అడిగేను.

"లోన్ పాతిక వేలు రాకపోతే...? వందో వెయ్యో తక్కువొస్తే?"

చాలా బాధగా, అయిష్టంగా, ఆఖరుకి ఒప్పుకున్నాడు. అతన్ని ఎల్లుండి కన్పించమన్నాను.

మర్నాడు నేను మంచి పనిలో ఉండగా 'నమస్తే' మాట విన్పించింది. తలెత్తి చూసేను. ఎదురుగా ఓ అమ్మాయి. ఇరవై ఏళ్ళుండొచ్చు. అందంగా ఉంది.

"కూర్చోండి"

ఆ అమ్మాయి నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

'వాట్ కెనై డూ ఫర్ యూ"

"నా పేరు అమూల్య. పి. ఎఫ్. లోన్ అప్లికేషనొకటి ఉంది మీ దగ్గర"


"ఎవరిది."

"మా నాన్నగారిది. నిన్న వచ్చేరు"

"ఇక్కడికి చాలా మంది వస్తుంటారు. మీ నాన్నగారి పేరు చెప్పండి"

ఆ అమ్మాయి చెప్పింది. నిన్న వచ్చి దీనంగా అడిగిన ఆ ముసలాయనే. ఈ అందమైన అమ్మాయి ఆ అర్భకుడి కూతురా - అనుకున్నాను.

"మీ నాన్నగార్ని రేపు రమ్మన్నాను కదండీ"



"లెక్కవేసే అప్లై చేసేను. పది రూపాయలుఎక్కువే వస్తుంది ఎలిజిబుల్ పెర్సంటేజీ ఎంతొస్తే అంతా రౌండాఫ్ చేయకుండా ఇస్తే"

నేను లెక్క చూసేను. అతను చెప్పింది కరెక్టే. ముసలాడు లెక్కల్లో దిట్టే.

"పెద్దవారు. మీకు తెలియందేముంది. బయట పాతిక వేలు అప్పు చేస్తే అయిదు చొప్పున ఎంతవుతుంది నెలకి. వడ్డీ అయితే ప్రతినెలా కట్టాలి. ఇది ఒక్కసారి కడితే చాలు"

... ఇది నా డబ్బే కదా, ఎందుకివ్వరసలు.. లాంటి మాటలు అంటాడనుకున్నాను. అంటే నేనేమనాలో కూడా రెడీగా ఉన్నాయి సమాధానాలు. కానీ అతనలా ఏమీ అనలేదు. బ్రతిమలాడుతూనే మాట్లాడేడు. నేను ఆఖరికి రౌండ్ ఫిగర్ వెయ్యి రూపాయలు చేసుకో మన్నాను. నాకు ప్రత్యేకంగా ఏమీ ఇవ్వొద్దులెండి అన్నాను. ఫ్రీగా చేసి పెడతానన్నాను.

"ఇటు వైపు పనుండి వచ్చేను. ఒకవేళ అయ్యిందేమో కనుక్కుందామని"

"ఇంకా మొదలు పెట్టలేదు. అది సరే, మీ నాన్నగారు పెళ్ళి అన్నారు. మీకేనా?"

"అవునండి" అని ఒక్కక్షణం ఆగి.." ఈ రోజు పెడితే రేపటికి అయిపోతుందా. కాస్త మా అప్లికేషన్ పని చూడండి" అంది.

ఆ అమ్మాయి అడిగిన తీరు ముచ్చటగా అన్పించింది. అందుకేనేమో మాటిచ్చేసేను.

"చేసేస్తానూ. సాయంత్రానికి అయిపోతుంది. సాయంత్రం రమ్మని చెప్తారా ఫాదర్ని"

"ఫాదర్ రారు. నేనే వస్తాను"

"ఆథరైజేషన్ లెటర్తో ఆఫీసుకి వస్తారా. వస్తే అయిదులోపు రండి"

"ఆథరైజేషన్ లెటర్తో కాదు. మంచి డ్రెస్సుతో మున్సిపల్ పార్కుకి వస్తాను. సాయంత్రం అయిదు తర్వాత."

ఆ మాట విని నాకు మాటలు రాలేదు. రెప్పలు వేయకుండా ఆ అమ్మాయి వైపే చూస్తూ ఉండిపోయేను. ఆ అమ్మాయి మాట్లాడుతోంది.

"లోన్లోంచి ఒక్క వంద రూపాయలు తీసినా కష్టమే అని మా నాన్నగారు మీకు చెప్పేరట. అయినా వెయ్యి రూపాయలివ్వమన్నారుట. అందుకే పార్కుకి రండి. అంతకంటే విలువైన అనుభూతినిస్తాను. చెక్ కోసం రేపు నాన్నగారు ఆఫీసుకొస్తారు"

అవాక్కై చూస్తూ ఉండిపోయాను. అవునన్నానో వీలవ్వదనన్నానో తెలియలేదు. అంతలోనే ఆ అమ్మాయి లేచింది. చూస్తుండగానే వెళ్ళిపోతోంది.

అయిదవగానే సీట్లోంచి లేచాను. ఫైళ్ళు కట్టి పడేసి రూమ్‌కెళ్ళి ఫ్రెష్ అయ్యాను. వెంటనే మున్సిపల్ పార్కుకి వెళ్ళేను. ఎక్కువ వెదక్కుండానే ఆ అమ్మాయి కన్పించింది. ఓ సిమెంటు బెంచీ మీద కూర్చొనుంది. ఉదయం కట్టుకున్న చీర కాదు. మరొకటి కట్టుకుంది. ఉదయం కంటే ఆకర్షణీయంగా ఉంది.నేను దగ్గరకు వెళ్ళగానే నవ్వుతూ పలుకరించి కూర్చోమంది. ఆ అమ్మాయి ప్రక్కనే కాస్త దూరంగా కూర్చున్నాను.

"రారేమో అనుకున్నాను"

"... ... ... ..."

"యువకుల పరువు నిలబెట్టేరు, అమ్మాయితో పార్కులో కూర్చొని పొందే అనుభూతే ముఖ్యమని నిర్ణయించుకొని"

నాకేం అనాలో తెలియలేదు.

"ఏమిటీ మాట్లాడ్డం లేదు. ఫ్రీగా ఉండండి"

ఆ అమ్మాయి మాటలు, ఆ వాతావరణం - నన్ను కరెన్సీ కలెక్ట్ చేసుకొనే ఉద్యోగి ఆలోచనల్లోంచి యువకుడి ఆలోచనల్లోకి నెట్టేస్తున్నాయి. అందుకే వెంటనే ఏమీ మాటాడలేక పోయాను. కాసేపటికి నేనూ మాటలు కలపగలిగేను.

"మీరేం చేస్తున్నారు?"

"మీ ప్రక్కన కూర్చున్నాను."

"కాదు... నేనే వచ్చి మీ ప్రక్కన కూర్చున్నాను"

ఆ అమ్మాయి గలగలా నవ్వింది. ఆ అమ్మాయి నవ్వుతుండగానే అడిగాను... "నవ్వుతున్నాను. ఊపిరి పీల్చి వదులుతున్నాను అని కాకుండా ఏం చేస్తున్నారో చెప్పండి"

ఆ అమ్మాయి నవ్వడం అయ్యాక చెప్పింది...." డిగ్రీ ఫైనలియర్, ఈ నెలాఖర్న పరీక్షలు. పరీక్షలైన వెంటనే పెళ్ళి. డేట్ ఫిక్సయి పోయింది కూడా. ఆ తర్వాత సంసారం"

అంతలో ఐస్‌క్రీం వచ్చింది. రెండు తీసుకున్నాను. ఆ అమ్మాయికి ఒకటి అందించి నేనొకటి తీసుకున్నాను. ఐస్ క్రీమ్ తింటూ అంది. "నా పేరు నిన్న చెప్పేను. గుర్తుందా. అమూల్య. అంటే ఒక రకంగా వెలలేనిది అని కూడా అర్థం వస్తుంది. ఆడపిల్లను, కట్నం ఇవ్వరుగా. ఆడపిల్లలందరూ అమూల్యలే నిజానికి"

ఆ మాట నవ్వుతూనే చెప్పింది. కానీ అందులో వినిపించీ వినిపించని జీర ఉంది.

"... ఏమిటీ ఆలోచిస్తున్నారు. మీ పేరు అడగలేదనా. తెలుసు. ఆనంద్ . మీ ఆఫీసులో డైరక్ట్‌గా మీ సీటు దగ్గరకు ఎలా వచ్చాననుకున్నారు మరి"

"పార్క్‌కి ఇంట్లో చెప్పే వచ్చారా?"

" ఒక కుర్రాడ్ని కలుసుకోడానికి పార్క్‌కి వెళ్తున్నానని చెప్తే ఇంట్లో రానిస్తారా. ఏదో చెప్పి వచ్చేను."

"ఎందుకు"

"ఉదయం ఆఫీసులో చెప్పేనుగా. వెయ్యి రూపాయలు మిగిలిద్దామని"

" ఏమిటి ఆలోచిస్తున్నారు. వెయ్యి పోయిందనా?"

"కాదు..."

"వెయ్యి వదులుకోకూడదనా?"

"అదేమీ కాదు"

"మరేమిటి?"

"వెయ్యి రూపాయల కంటే విలువైన అనుభూతి అన్నారు. ఏమిటది?"

"మీరేమనుకొని వచ్చేరు?"

"ఏమీ అనుకోలేదు"

" అసలేమీ అనుకోకుండానే వచ్చారా. నేను నమ్మను"

"ఏమిటీ అమ్మాయి ఇంత ధైర్యంగా పార్కుకి రమ్మంది. ఏమిటో తెలుసుకుందామని వచ్చాను. మరోలా అన్పించేలా లేరు మీరు, మీ ప్రవర్తన"

"థాంక్యూ మీరు నేననుకున్న అబ్బాయే"

"ఏమనుకున్నారు నా గురించి."

"మా నాన్నగారు అమ్మతో అంటుంటే విన్నాను - కుర్రాడు మంచాడులాగే ఉన్నాడు. ఆఫీసు వాతావరణం అటువంటిది కదా. చూసాక నేననుకున్నది నిజమే అయ్యింది"

"ఇంతకూ చెప్పనే లేదు. డబ్బు కంటే విలువైనా అనుభూతిఏమిటి?"

"అయితే నిజం చెప్పండి. నేను అందంగా ఉన్నానా?"

"చెప్పగూడదు.కానీ అడుగుతున్నారు కాబట్టి చెప్తున్నాను. మీరుచాలా అందంగా ఉన్నారు." " అయితే ఆ అనుభూతి ఏమిటో చెప్పొచ్చు. పార్కులో అందమైన అమ్మాయి ప్రక్కన కూర్చోవడం. కలిసి ఐస్‌క్రీం తినడం. నవ్వుకోవడం. మాట్లాడు కోవడం. మీ అదృష్టానికి ఈర్ష్య పడుతూ వెళ్ళేవాళ్ళూవచ్చేవాళ్ళూ చూడ్డం ఇదంతా డబ్బు కంటే విలువ చెయ్యదా అనుభూతిని అస్వాదించే మనసుంటే?"

"మీరు బాగా మాట్లాడతారు."

"నిజంగానే అంటున్నారా?"

"ఈ పార్కులో మనిద్దరం ఒకే బెంచీ మీద కూర్చున్నాం అన్నంత నిజం. అవునూ. ఇంతకూ మీ కాబోయేవారు ఏం చేస్తున్నారు?"

"భార్యను బొటాబొటీగా పోషించగలిగే గుమాస్తా ఉద్యోగం"

"మీ నాన్నగారికి వెయ్యిరూపాయల భారం తగ్గిద్దామనే కదూ మీరిలా వచ్చింది?"

"అవును, అలా అడుగున్నారేం?"

"ఏం లేదు, ఒక్కోసారి ఇలాంటి సాహసాలు ప్రమాదాలకు దారితీస్తాయి"

"మీలాంటి వాళ్ళతో అలాంటి ప్రమాదం రాదు. అందుకే ఈ పార్క్ ప్రపోజల్ పెట్టేను."

"అలా అని నా ముఖం మీదేదైనా రాసి ఉందా?"

"చదవడం తెలిస్తే మనసు ముఖంలోనే కన్పిస్తుంది. ఆఫీసులో మీ ప్రవర్తన కావాలని చేస్తున్న నటనగానే కన్పించిందట నాన్నగారికి. నాకూ అలాగే అన్పించింది. మీరు పూర్తిగా కలుషితం కాలేదు. మీకంటూ కొన్ని స్వంత ఆలోచనలున్నాయి. వాటిని మీ ఉద్యోగం అనే మేఘం క్రమ్ముకుంటోంది."

నా మనసులో ఆ అమ్మాయి పసిగట్టిన ఆ భాగంలో ఏదో కదలిక వచ్చింది. కాలేజీలో మిత్ర బృందంతో ఎన్ని అనేవాడిని. ఎలా వాదించేవాడిని. జీవితాన్ని నిలబెట్టే ఉద్యోగం వచ్చింది. అది మనిషిగా నన్ను పతనం చేస్తోంది అని అన్పిస్తుం దెప్పుడూ, నేను విషయంలోకి వచ్చేను.

"ఇన్ని ఆలోచనలున్న మీరు చేయవల్సిందిది కాదు."

"ఏమిటి?"

"అప్పుడే పెళ్ళి చేసుకోవడం."

"ఏం చేయగలను మరి."

"డిగ్రీ అవుతోంది కదా. ఏదో ఉద్యోగం చూసుకొని మీ ఇంటికి ఆర్థికపరమైన ఆసరా నందించి ఆ తర్వాత పెళ్ళి చేసుకోవలసింది."

నా ప్రశ్నకు అమూల్య సమాధానం చెప్పడానికి కష్టపడుతుందనుకున్నాను. కానీ చిన్నగా నవ్వి అప్పుడంది... "సగటు ఆడపిల్లల్లో కొంత మంది ఖాళీగా ఉండలేక చదువుతారు. మరి కొంత మంది వచ్చేవాడు డిగ్రీ అయినా లేదా అంటాడని చదువుతారు. కొంతమందికి మీరన్న ఆలోచన వచ్చినా తల్లిదండ్రుల గుండెల మీద కుంపటిని ఆర్పడానికి పెళ్ళికి ఒప్పుకుంటారు."

"మీ నాన్నగారి గుండెల మీద కుంపటి మీ పెళ్ళితో ఆరిపోదు. అప్పట్లో మరింత రాజుకుంటుంది,"

"మరేం చెయ్యమంటారు"

కాసేపు నేనేమీ మాట్లాడలేదు. 'అలా చేస్తే ఎలా ఉంటుంది' అని అప్పుడప్పుడూ వచ్చే ఒక ఆలోచన ఇప్పుడు గుర్తొచ్చింది.

"చెప్తాను. చేస్తారా?"

"చెప్పండి. ప్రయత్నిస్తాను"

"అందుకు ధైర్యం కావాలి. ఆ తర్వాత జీవితం ఏమైపోతుందో అన్న భయం ఉండకూడదు"

"నాన్నగారి జీవితం ఏమీ అవదు కదా"

"మధ్యతరగతి కుటుంబాలకు ఆడపిల్ల ఒక సమస్య. ముఖ్యంగా పెళ్ళి. ఆ తర్వాత సమస్య తీరిపోతే మీ నాన్నగారి జీవితం ఆనందమయమే అవుతుంది గానీ, మరింకేమీ అవదు కదా?"

"అవును. అదేమిటో చెప్పండి"

"చెప్తాను. రేపు మీ నాన్నగారిని ఆఫీసుకు రావద్దని చెప్పండి. మీరు రండి"

"నాన్నగారిని రావొద్దని ఎలా చెప్పను?"

"ఏదో చెప్పి కదా పార్కుకి వచ్చేరు. అలాగే ఏదో చెప్పి రావద్దని చెప్పండి"

"ఆథరైజేషన్ లెటర్తో రానా. ఇంతకూ లోన్ శాంక్షనయ్యిందా?"

"ఇంక మీకు లోన్తో అవసరం ఉండదు"

అమూల్య విచిత్రంగా చూస్తుంటే, ఏదో అడగబోతుంటే నేనే అన్నాను. "ఏమీ అడక్కండి. అన్నీ రేపే చెప్తాను. పదండి వెళదాం"

ఇద్దరమూ లేచాం. అమూల్య వెళ్ళిపోయింది. నడుస్తున్న నాకు గిల్టీగా ఉంది, నా మాటలకు. లంచాలు తీసుకునే నేను, వాటి కోసం కొంతమందిని బాధపెట్టిన నేను అలా మాట్లాడానేమిటి.

కారణం, అమూల్య.

ఆమె అందంగానే కాదు. చురుగ్గా కూడా ఉంది. చదువుకుంది. ఆలోచనలున్నాయి. ఆచరించే ధైర్యం కూడా ఉంది. కానీ ఎందుకో తల వంచుతుంది. అలాంటి అమ్మాయిలెందరో ఉన్నారు. వాళ్ళెందుకో పరిస్థితులకు తల వంచుతున్నారు.

ఏ సంకెళ్ళు వాళ్ళనలా కట్టి పడేస్తున్నాయి?

అలా చాలాసేపు ఆలోచించేను. నాలో ఆలోచనలు తట్టిలేపిన ఆ అమ్మాయిపెళ్ళి ఒక మధ్యతరగతి తండ్రి అప్పులో మునిగిపోయి కాదు అవ్వాల్సింది. చట్టం అందిస్తోన్న ఆసరాను సక్రమంగా వినియోగించుకొని జరగాలి!

ఆ రాత్రంతా నేను అమూల్య గురించి కాదు, నా గురించే ఆలోచించుకున్నాను!

* * *

**అ**మూల్య గురించి ఎదురుచూస్తూ ఆఫీసు పని చేసుకుంటున్నాను. అమూల్య వచ్చాక ఇద్దరమూ క్యాంటీన్కు బయల్దేరం. వెళ్ళేముందు నా టేబుల్ సొరుగు తీశాను. ఉదయం రాగానే డ్రాఫ్ట్ చేసి స్వయంగా టైప్ చేసిన కాగితాల్లో ఒక బంచ్ని అందుకున్నాను. బ్రేక్ఫాస్ట్కీ, లంచ్కీ మధ్య సమయం కావడంతో క్యాంటీన్ పల్చగా ఉంది. టీ త్రాగాక నా చేతిలో కాగితాలను అందించాను. అమూల్య చదవబోతూంటే అన్నాను.

"నెమ్మదిగా చదవండి. మధ్యలోనే కంగారు పడకండి"

"పది నిముషాల్లో అమూల్య చదివేసింది. ఒక క్షణం తర్వాత అడిగింది.

"ఇది సాధ్యమా?"

"అసాధ్యం మాత్రం కాదు. అవసరమైన ఆధారాలుంటే. వాటిని ధైర్యంగా ప్రెజంట్ చేస్తే"

"ఏమిటది?"

"మేరేజ్ ఫిక్స్ చేసుకున్నప్పుడు ఫోటోలు తీసారా?"

"ఉన్నాయి"

"ఆ ఫోటోలు చూస్తే కాబోయే పెళ్ళికొడుకు, పెళ్ళికూతురూ మీ ఇద్దరే అని అర్థమవుతుందా?"

"అవుతుంది,"

"వెరీగుడ్. అయితే మీరిచ్చే కట్న కానుకల గురించి ఏమైనా రాసుకున్నారా?"

"ఏం రాసుకుంటారు.. ఆం.. మాట మార్పులు, గొడవలు జరగకుండా ఉండేందుకు కాగితాలు రాసుకొని వాళ్ళూ మేమూ మార్చుకున్నాం"

"అలాంటివి ఉంటే మరింత బలం"

"అవేమీ పెళ్ళిళ్ళు చేయలేవు. డబ్బు తప్ప!"

"విషయాన్ని కాగితం మీద పెట్టి తగిన ప్రయత్నం చేస్తే ఎందుకవదు?"

"సాధారణ పరిస్థితుల్లో అవదు"

"మరి, అసాధారణ పరిస్థితుల్లో?"

"అంటే.."

"న్యాయం, చట్టం, రాజకీయం.. ఇవన్నీ కలిస్తే..?"

"నాకా నమ్మకం లేదు. వాళ్ళని ఎన్ని చుట్టిముట్టినా నేను ఆడదాన్ని. ఆఖరు అస్త్రంగా వాళ్ళు నా మీద బురద జల్లుతారు"

"అందుకు సాక్ష్యాలుండాలి"

"పుట్టిస్తారు"

"వాళ్ళ ఆశలకీ, కోరికలకీ మనం పుట్టించలేమా సాక్ష్యాలు?"

అమూల్య ఏమీ అనలేదు. కలవరపడినట్లుగా కన్పించింది.

"ఈ కాగితాలు ఎవ్వరికీ ఇవ్వం. పెళ్ళికొడుక్కీ, అతని తల్లిదండ్రులకీ చూపిస్తాం. ఆడపిల్ల పట్ల దేశం ఇప్పుడున్న పరిస్థితుల్లో బెదురుతారు."

"వాళ్ళందరూ పెళ్ళి చేయగలిగినా, సంసారం చేయించలేరుగా.."

"చాలామంది మీలాగే ఆలోచిస్తారు. అది సరియైన ఆలోచన కాదని నా ఉద్దేశం. అతనిది గవర్నమెంటు ఉద్యోగం. అసలుకే ఎసరు వస్తుందన్న భయం ఉంటుంది. ముందు అయిష్టంగానే మసులుతాడు. కానీ ఎటువంటి వ్యక్తికైనా మనసు నాణేనికి మరో ప్రక్క మంచి వ్యక్తిత్వం ఏ మాత్రమైనా ఉండకపోతుందా? అప్పుడు మీరు దాన్ని తట్టిలేపాలి- వ్యక్తిగతమైన ద్వేషంతోనో, జీవితాంతం పగను రగుల్చుకుంటూ కాపురం చేద్దామనో కాదు ఇదంతా చేసింది. కేవలం ఆర్థికపరమైన, సాంఘిక పరమైన ఆలోచనతోనే. అది పెళ్ళయ్యే వరకే. ఇప్పుడు మనం భార్యాభర్తలం. కలసి సాగుదాం- అలా చెప్పి అతని మెదడుకి సానపెడితే, అతడు తప్పకుండా మంచి భర్త అవుతాడు. కొన్నాళ్ళ స్నేహమే ఒడిదుడుకులకు గురి అవుతుంది. కలకాలం సాగాల్సిన కాపురాల్లో ఒడిదుడుకులుండవా. కట్నకానుకలు దండిగా అందించిన కాపురాల్లో కూడా ఏవో కలతలు రావడం లేదా. తర్వాత అవి సర్దుకోవడం లేదా. మనిషిని మలుచుకొనే ప్రజ్ఞ అవసరం ఇక్కడ!"

అమూల్యకు అర్థమైనట్లుంది. కాగితాన్ని మడిచి లేచింది. నేనూ లేచాను. వెళ్ళిపోయేదల్లా ఆగి అంది.

"సాయంత్రం అయిదున్నరకు పార్కుకి రండి"

"మళ్ళీనా. ఎందుకు?"

"అక్కడ చెప్తాను"

"అమూల్య వెళ్ళిపోయింది. నేను సెక్షన్లోకి వెళ్ళి పోయాను. ఉదయం మొదలుపెట్టిన రెండు ఫైల్స్ పూర్తి చేశాను. అప్పుడే బాస్ నుండి పిలుపొచ్చింది. నేను కాబిన్లోకి వెళ్ళేను. వెళ్ళేముందు సొరుగు లాగేను. టైప్ చేసిన కాగితాల రెండో బంచ్ని తీసి జేబులో పెట్టుకున్నాను. కాబిన్లోంచి పది నిముషాల తర్వాత వచ్చాను. నా సీట్లో కూర్చున్నాను. గుండెలనిండా గాలి పీల్చుకున్నాను.

**అంతా పిచ్చివారే!**

పార్కులోని బెంచీ మీద ముగ్గురున్నారు. మధ్యవాడు పేపరు చదువుమంటే, ప్రక్కవాళ్ళిద్దరూ బస్సులో టిక్కట్లు అమ్ముతున్నట్లు ఆట ఆడసాగారు. దారిన పోతున్న పోలీసు అది చూసి ఆగి, పేపరు ఆసామిని వాళ్ళగురించి అడిగాడు. వాళ్ళు మా వాళ్ళే అని అతను జవాబిచ్చాడు 'అదిసరే, పార్కులో ఈ పిచ్చి ఆటలేమిటి, వాళ్ళని ఇంటికి తీసుకెళ్ళు' అన్నాడు పోలీసు. 'అలాగే... రైట్ రైట్' అని అరిచి బస్సును పోనిస్తున్నట్లు, గాలిలో స్టీరింగు వీలు తిప్పుతూ, ఉత్తుత్తి గేర్లు మార్చసాగాడతను.

అప్పుడు కన్పించింది నా టేబుల్ మీద ఓ కవరు. దాన్నందుకున్నాను.

* * *

అయిదున్నరకి పార్కుకి వెళ్ళేను. అప్పుడే అమూల్య వస్తోంది. ఇద్దరం నిన్న కూర్చున్న సిమెంటు బెంచి మీదే కూర్చున్నాం. ముందుగా నేనే మాట్లాడేను.

"ఎందుకు రమ్మన్నారు. నేనిచ్చిన సలహా గురించి చర్చించడానికా?"

"మీ సలహా గురించి ఇంట్లో అమ్మానాన్నల్తో చర్చించేను. ముందు వాళ్ళు వెనుకంజ వేశారు. జీవితంలో రాజీ పడవలసిన అవసరం ఆడదానికే ఎక్కువ. ప్రస్తుత పరిస్థితుల్లో తెగువ అవసరం అని వాళ్ళని ఒప్పించేను. ఇంక చర్చించేదేమీ లేదు. ఆచరించడమే"

"అయితే మరెందుకు రమ్మన్నారు. మరేదైనా అనుభూతి అందించడానికా?"

"కాదునేననుకుంటున్నది మీ మనసులో ముద్రించడానికి"

"ఏమిటది?"

"నాన్నగారి మాటల్లో అర్థమైంది. మీరు పూర్తిగా కలుషితం కాలేదని నాతో మీరు మాట్లాడినప్పుడు తెలిసింది. సమాజానికి అవసరమైన ఆలోచనలు మీలో ఉన్నాయని. యువతరానికి సారథ్యం వహించగలిగే అర్హతలున్నాయని. అలాంటి మీరు అలవర్చుకోవాల్సిన అంశం ఒకటుంది.."

అమూల్య ఒక్క క్షణం ఆగి మళ్ళీ చెప్పింది...

"సమాజంలో ఎంతోమంది ఎన్నో బాధలు పడుతున్నారు. అందులో చాలా ఆర్థిక సంబంధమైనవే. వాటికి కారణాలు ఆశ, కుసంస్కారం. వాటి రూపాంతరాలే వరకట్నాలూ, లంచాలూను.

చట్టాలూ శాసనాలూ ఎన్నో ఉన్నా వ్యక్తిగత ఆచరణ లేదు. అందుకే దురాగతాలకు ఎప్పటికప్పుడు ఊపిరి అందుతోంది..

... లంచాలు తీసుకునే వాళ్ళు ఆర్థికంగా ఎదగొచ్చు. కానీ వ్యక్తులుగా దిగజారిపోతారు. లంచం ఇచ్చేవాళ్ళు తమ అవసరాలకి, అభ్యున్నతికీ ఇస్తారు. కానీ ఇచ్చేవాళ్ళల్లో కొంతమంది మా నాన్నగారిలాంటి వాళ్ళూ ఉంటారు.

అలాంటి వాళ్ళేమైపోతారో ఆలోచించాల్సిన అవసరం లేదా. స్వంత లాభాల కోసం లంచాలిచ్చేవాళ్ళు దేశానికి ఎంత కీడు చేస్తారో పట్టించుకోనవసరం లేదా? ఎవరికి వాళ్ళు నోట్ల కట్టల కోసం అవినీతిని ఆశ్రయిస్తే సమాజం జవసత్వాలుడిగి పోయి చచ్చు పడిపోదా."

అమూల్య ఆలోచనలకు, ఆవేశానికి ఆశ్చర్యం కలిగింది. తర్వాత స్వరం తగ్గించి అంది.

... "ప్రభుత్వ యంత్రాంగానికి ప్రతినిధులు మీరు. సేవలందించి జీతాలు తీసుకోవాలి. సమస్యలతో వచ్చేవారికి సేదతీర్చాలి. ప్రభుత్వానికి శక్తినందించాలి. దేశాభ్యుదయానికి చేయూత నివ్వాలి. నాకు చక్కని సలహా నిచ్చి, మానసికమైన ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చి మీరు లంచాలు వసూలు చేస్తూనే ఉంటారా.."

అమూల్య వేసిన సూటి ప్రశ్నకు నాలో నేనే సిగ్గుపడ్డాను. కుచించుకుపోయాను. అప్పుడింక చెప్పకుండా ఉండలేకపోయాను. ఉదయం అమూల్య వచ్చి వెళ్ళాక కేబిన్లో బాస్‌కీ నాకూ మధ్య జరిగిన సంభాషణ.

* * *

"ఆ ముసలాడి లోన్ ఫైలు పూర్తి చేసావా ఆనంద్?"

"లేదండి"

"ఇవాళ వస్తాడేమో కదా?"

"రారండి"

"అదేమిటి?"

### అలా అయితే అప్పుడే వస్తా!

హనుమన్న పల్లెనుంచి నౌకరీకోసం పట్నం వచ్చాడు. ఒక ఇంటి యజమానికి అతడు నచ్చాడు. 'ఇంటి పని, తోటపని చూసుకుంటూ నమ్మకంగా పనిచేయి తిండీ, బట్టా కాక నెలకి ఐదువందలిస్తాను. వచ్చే సంవత్సరంనుంచి ఎనిమిదొందలు, సరేనా? ' అని అన్నాడు. దానికి హనుమన్న, 'సరే బాబయ్యా, అలా అయితే నాను వచ్చే సంవత్సరం మళ్ళీ తమ కాడ పొస్తాను పనిలోకి!' అని అంటూ భుజం మీది తుండు గుడ్డ దులుపుకుని తలకి చుట్టుకుని వెళ్ళిపోయాడు.

\- ఆర్. సత్య

"అతనికి లోన్ అక్కర్లేదుట"

"వాడి ఖర్మ నేను చెప్పిన రెండు ఫైళ్ళూ పూర్తయ్యాయా?"

"ఇవిగోండి"

"మరి.. వసూలు చేశావా?"

"లేదు"

"అదేమిటి, వాళ్ళివ్వలేదా?"

"కాదు, నేనడగలేదు"

"మరి ఫైనల్ ఎప్రూవల్ వరకూ చేసేసావేంటి?"

"అది మన బాధ్యత. అందుకే మనకి జీతాలిస్తుంది ప్రభుత్వం"

"అబ్బో. శంకరగిరి మాన్యాలే గతి నీకు"

"అంతకు ముందు నీకు శ్రీ కృష్ణ జన్మస్థానం ప్రాప్తిస్తుంది!"

"వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్?"

"అయాం నాట్ టాకింగ్ నాన్సెన్స్. గో త్రూ దీజ్ పేపర్స్ విత్ సెన్స్. బలవంతం చేస్తే వీటిని ఆయా అడ్రెస్సులకి పోస్టు చేస్తాను. మీ అసిస్టెంటుని నేను. ఇంతవరకూ మీకు లంచాల్ని కలెక్ట్ చేసి పెట్టేను. ఇప్పుడు తగిన సాక్ష్యాధారాలు ఎంక్లోజ్ చేసేను"

"నువ్వు కూడా బుక్ అవుతావు!"

"అఫ్‌కోర్స్ అప్రూవర్‌గా చివరి నిముషంలోనైనా తప్పించుకోగలిగే అవకాశం నాకుంది. లేకపోయినా ఫర్వాలేదు. నా వెనుక ఆధారపడేవాళ్ళెవ్వరూ లేరు. మీ వెనుక ఉన్నవాళ్ళను లెక్కపెట్టుకోండి"

* * *

చీకటి పడుతోంది. నా మాటలు విన్న అమూల్య ముఖంలో వెలుగు కనిపిస్తోంది. ఇద్దరమూ లేచాం. అమూల్య వేగంగా అడుగులేస్తూ వెళ్ళిపోయింది. నేను అడుగులో అడుగులు వేసుకుంటూ వెళ్తున్నాను నా రూమ్ వైపుకి.

అమూల్యకి నేను పెళ్ళికాని యువకుడినని తెలుసు. అన్నీ చెప్పింది కానీ 'ఆ' విషయం గురించేమీ చెప్పలేదు. స్ఫురించలేదేమో. నాకైతే మధ్యాహ్నం ఆఫీసులో నాన్న రాసిన కవర్ని విప్పి చదివినప్పుడే స్ఫురించింది. అందుకే రూమ్‌కి వెళ్ళిన వెంటన నాన్నకు జవాబు రాసేను.

"ప్రియమైన అమ్మకూ, నాన్నకూ నమస్కారములు. మీరు రాసిన ఉత్తరం అందింది. విషయాలు తెలిసాయి. నా నిర్ణయమే మీదన్నారు. చాలా సంతోషం,. ఆస్తి ఎక్కువగా ఉండి, కట్నకానుకలు బాగా ఇవ్వగలిగే ఆ సంబంధం- వద్దని చెప్పండి మధ్యవర్తికి. కట్నకానుకలు బాగా ఇవ్వలేని ఆ రెండో సంబంధమే ఖాయం చెయ్యండి. ఎందుకంటే అందరికీ ఆ కుటుంబ పద్ధతులూ, అమ్మాయీ బాగా నచ్చాయి కదా. ఇకపోతే ఖాయం చేసుకునే ముందు వాళ్ళకి చెప్పండి- మనకు కట్నకానుకలేమీ వద్దని. పెళ్ళి సింపుల్‌గా చెయ్యమని. ఖర్చులేమైనా వాళ్ళూ మనమూ సరిసమానంగా భరిద్దామని. వాళ్ళకీ విషయం తెలియజేసినట్లుగా తప్ప మరింకో విషయంతో నాకు ఉత్తరం రాయకండి.

ప్రేమతో.. మీ ఆనంద్.

ఉత్తరం మడిచి సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాక నాకెంతో హాయిగా తేలిగ్గా అన్పించింది.

* * *

అమూల్య వివాహం మామూలుగానే జరిగింది. అడ్వాన్స్ కట్నంగా తీసుకున్న పాతికవేలూ తిరిగిచ్చేసేరు. ఆ డబ్బు పెళ్ళి ఖర్చులకి సరిపోయింది. అమూల్య తండ్రి అతని భార్య మెడలో పసుపుకొమ్ము కట్టలేదు.

అమూల్య దంపతులకు వాళ్ళ పెళ్ళిలోనే నా పెళ్ళికార్డు ఇచ్చేను!